www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 10 జూన్ 2023

## పుస్తక పఠనం అలవర్చుకోవాలి

ప్రశంసా పత్రాలతో విద్యార్థులు

ప్రజాశక్తి-వాల్మీకిపురం

ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పుస్తకపఠం అలవర్చుకోవడం వలన సమాజంలో జరుగుతున్న వాటిని తెలుసుకొని, విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చునని స్థానిక గ్రంథాలయ అధికారి రమాపతి అన్నారు. శుక్రవారం స్థానిక గ్రంథాలయంలో వేసవి శిక్షణ ముగింపు సందర్భంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి శిక్షణలో విద్యార్థులకు వివిధ రంగాలలో శిక్షణ ఇచ్చి నైపుణ్యాలను పెంపొందించడం జరిగిందన్నారు. అనంతరం పశువైద్యాధికారిణి చరిత 35 మంది విద్యార్థులకు గ్రంథాలయ సభ్యత్వం చెల్లించారు. స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల హెచ్‌ఎం శ్రీదేవి విద్యార్థుల పోటీ పరీక్షలకు ఉపయోగపడే పుస్తకాలను అందించారు. తదనంతరం 40 మంది విద్యార్థులకు బహుమతులు, ప్రశంసాపత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో యామిని, సరోజమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

# బినామీ పేర్లతో వేల ఎకరాల భూకబ్జా

### - బహిరంగ సభలో నారా లోకేష్

సిద్దవటం వద్ద పాదయాత్రలో నారా లోకేష్

ప్రజాశక్తి-సిద్ధవటం

రాజంపేట నియోజకవర్గంలోని వైసిపి నాయకులు బినామీల పేర్లతో వేల ఎకరాలు కబ్జా చేశారని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ అన్నారు. యువగళం పేరుతో లోకేష్ చేపట్టిన పాదయాత్ర 121 రోజుకు చేరుకుంది. శుక్రవారం అన్నమయ్య జిల్లా రాజంపేట నియోజకవర్గం సిద్దవటం మండలంలోని చంటిగారిపల్లె విడిది కేంద్రం నుంచి పాదయాత్ర ప్రారంభమై మూలపల్లె, సిద్దవటం, కమ్మపాలెం, జంగాలపల్లి విడిది కేంద్రం వరకూ పాదయాత్ర సాగింది. ఆయా ప్రాంతాల్లో స్థానికులతో ముఖాముఖి, మాటామంతి, సమావేశాలు వంటి కార్యక్రమాలు నిర్వహించారు. పాదయాత్ర సందర్భంగా సిద్దవటంలో నిర్వహించిన బహిరంగ సభలో లోకేష్ మాట్లాడుతూ నియోజకవర్గంలో జరిగిన భూకబ్జాలు, ప్రజలకు జరిగిన అన్యాయం, సొంత పార్టీ కార్యకర్తలే వేసిన కర పత్రాలు వేశారని పేర్కొన్నారు. ఎమ్మెల్యే మేడా మల్లికార్జున్‌రెడ్డి బినామీల పేరుతో వేల ఎకరాలు కొట్టేశాడన్నారు. జడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డితో కలిసి భారీగా భూకబ్జాలకు పాల్పడ్డారని విమర్శించారు. ప్రభుత్వ, పేదల భూములు కబ్జా చేస్తున్నారన్నారు. వారిద్దరూ రూ.15 కోట్లు జడ్పీ సొమ్ము కాజేశారని, జగన్‌ని ఆదర్శంగా తీసుకోని ఊరుకో ప్యాలస్ కట్టుకున్నారని పేర్కొన్నారు. మేడా హైదరాబాదులో ఒక ప్యాలెస్, బెంగుళూరులో మరో ప్యాలెస్, తిరుపతిలో ఒక ప్యాలెస్, రాజంపేటలో మరో ప్యాలెస్, స్వగ్రామం చెన్నాయగారిపల్లెలో మరో ప్యాలెస్ ఐదు ప్యాలెస్‌లను కట్టుకొని జగన్‌ను మించిపోయాడన్నారు. నందలూరు తన సొంత మండలమైన చెన్నాయగారిపల్లె చుట్టూ సుమారు 1000 ఎకరాల ప్రభుత్వ భూమిని తన చిన్నాన్న మేడా భాస్కర్‌రెడ్డితో కలిసి కబ్జా చేశారని పేర్కొన్నారు. ఎమ్మెల్యేని మించి జడ్పీ చైర్మన్ అమర్నాథరెడ్డి తమ స్వగ్రామమైన రాజంపేట మండలం ఆకేపాడులో మూడు శ్మశానాలున్న గుట్టనే ఆక్రమించి అక్కడ మైసూర్ ప్యాలెస్ లాంటి ఇల్లును కట్టి చుట్టూ వందలాది ఎకరాలు భూకబ్జాలకు పాల్పడ్డాడన్నారు. మేడా, ఆకేపాటి స్వార్ధ ప్రయోజనాల కోసం రాజంపేటను సర్వనాశనం చేశారని విమర్శించారు. రాజంపేటను జిల్లా కేంద్రం కాకుండా అడ్డుకోవడం, మెడికల్ కాలేజీ రాకుండా అడ్డుకోవడం, అన్నమయ్య డ్యాం కొట్టుకుపోయేలా చేయడం, ప్రభుత్వ భూములు కబ్జా చేయడం, మున్సిపాలిటీకి వంద కోట్లు తెస్తానని హామీ ఇచ్చి రూపాయి తేకపోవడంపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మేడా స్వార్థం వలనే అన్నమయ్య, పింఛా డ్యాంలు కొట్టుకుపోయి 38 మంది చనిపోయారన్నారు. ఇసుకని దోచేసి టిప్పర్లలో బెంగుళూరు, చెన్నై, హైదరాబాద్ ఎక్స్ పోర్ట్ చేసి కోట్లు గడిస్తున్నాడన్నారు. టి సుండుపల్లి మండలంలో ఎమ్మెల్యే తమ్ముడు ప్రభుత్వ స్థలాలైన కొండలు, గుట్టలు చదును చేసి ప్లాట్లు వేసి అమ్ముకుంటున్నాడని విమర్శించారు. నందలూరు మండలంలో ఎమ్మెల్యే చిన్నాన్న అరాచకాలకు కేర్ ఆఫ్ అడ్రస్‌గా మారారని తెలిపారు. ఆఖరికి మాట వినకపోతే అధికారుల పై దాడులు, ట్రాన్స్ ఫర్లు చేయిస్తున్నాడన్నారు. ఒంటిమిట్టను ఆంధ్రప్రదేశ్ భద్రాద్రిగా అభివద్ధి చేసింది టిడిపి అని పేర్కొన్నారు. రూ.100 కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. ఒంటిమిట్ట చెరువుకు సోమశిల జలాలు అందించడానికి రూ.30 కోట్లు ఖర్చు చేశామన్నారు. రాష్ట్రంలో గ్రామ సీమలను నిర్వీర్యం చేశారని తెలిపారు. పంచాయతీల్లో బ్లీచింగ్ చల్లడానికి కూడా చిల్లిగవ్వ లేకుండా చేశారని విమర్శించారు. గ్రామ పంచాయతీలకు చెందిన రూ.8,600 కోట్లను ప్రభుత్వం దొంగిలించిందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోనూ తాగునీటిమ కోసం ప్రజలు ఐదు రోజులు నిరీక్షించాల్సి దౌర్భాగ్యం పట్టిందన్నారు. టిడిపి అధికారంలోకి రాగానే ఇంటింటికీ తాగునీటి కుళాయి అందజేస్తామని చెప్పారు. పంచాయతీలకు విధులు, నిధులు కల్పించి బలోపేతం చేస్తామన్నారు. సాగునీరు లేక భూములన్నీ బీళ్లుగా మారాయన్నారు. పాదయాత్రలో టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు ఆర్.శ్రీనివాసులరెడ్డి, నాయకులు బత్యాల చెంగల్రాయుడు, చమర్తి జగన్‌మోహన్‌రాజు, గంటా నరహరి పాల్గొన్నారు.

# పంటల బీమా అమలులో ప్రభుత్వం విఫలం

### ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్‌రెడ్డి

కడప మార్కెట్ యార్డ్‌లో పసుపు రైతుతో మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి

ప్రజాశక్తి- కడప అర్బన్

ఖరీఫ్, రవీ సీజన్లలలో అకాల వర్షాలకు నష్టపోయిన రైతులకు పంటల బీమా అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, వరి, వేరుశనగ, పసుపు తదితర పంటలకు మద్దతు ధర కల్పించాలని ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం కడప మార్కెట్‌యార్డులో పసుపు, వేరుశనగ ధాన్యాలను పరిశీలించి, అక్కడి రైతులతో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ దేశంలో గోధుమ తరువాత అత్యధికంగా పండించే, వినియోగించే పంట వరి అన్నారు. కేంద్ర ప్రభుత్వం వరి పంటకు క్వింటా ధర రూ.2060 నుంచి 2203 పెంచి కేవలం రూ. 143లతో రైతుల ఆదాయం రెట్టింపు చేశామని ప్రకటించడం దుర్మార్గమన్నారు. కరువు పీడిత రాయలసీమలో పండించే జొన్నకు రూ.210, సజ్జకు రూ.150, రాగి రూ.268, ప్రొద్దు తిరుగుడు పంటకు రూ. 360, పత్తికి రూ.640 పెంచామని గొప్పలు చెప్పడం దారుణమన్నారు. లక్షకు పైగా పెట్టుబడి, ఏడాది కాల పరిమితితో పండించే పసుపు పంటకు కేవలం రూ.400 ముష్టి మాదిరి విదిల్చిందన్నారు. ఒక్క పెసర పంటకు మాత్రం రూ.803 పెంచిందే తప్ప మిగిలిన ఏ ఒక్క పంటపైనా రైతుల కయ్యే పెట్టుబడి వచ్చే ఆదాయానికి పొంతన లేకుండా ఉందన్నారు. 2018లో ఒక టన్ను డిఎపి ధర రూ.10 వేలు ఉండగా ప్రస్తుతం రూ.50 వేలకు పెరిగిందన్నారు. పెరుగుతున్న విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల ధరలతో పాటు కూలీల ఖర్చు అమాంతం పెరిగిందన్నారు. డాక్టర్ స్వామినాథన్ కమిటీ సిఫారసుల ప్రకారం విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల ప్రస్తుత ధరలతోపాటు కూలీల ఖర్చు, రైతు శ్రమ, కౌలు మూడు భాగాలుగా చేసి వాటిపై అయ్యే ఖర్చుకు అదనంగా 60 శాతం జోడించి కనీసం మద్దతు ధర నిర్ణయిం చాలన్న సూచనలు పాలక ప్రభుత్వాలు పెడచెవిన పెడుతున్నాయన్నారు. మోడీ అధికారంలోకి రాకముందు వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చి, రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తానని నమ్మబలికి అధికారంలోకి రాగానే వ్యవసాయాన్ని పూర్తిగా కార్పొరేట్లకు కట్టబెట్టి రైతులను కూలీలుగా మార్చి అటు రైతులను, ఇటు వినియోగదారులను ఏకకాలంలో దోపిడీ చేసేందుకు చట్టాలు తీసుకుచ్చారన్నారు. కేంద్ర ప్రభుత్వం ఒక ప్రణాళిక బద్దంగానే వ్యవసాయానికి నిధుల కేటాయింపులో కోతలు విధిస్తూ, మౌలిక సదుపాయాల కల్పన బాధ్యతను పక్కకు నెట్టి, రాయితీలపై కర్కశంగా నిరంకుశంగా వ్యవహరిస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వం కనీసం మద్దతు ధర పెంచాలని వారి డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎపి రైతు సంఘం కడప జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గోపాలకష్ణయ్య, దస్తగిరిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు వెంకటసుబ్బయ్య, రామచంద్రారెడ్డితోపాటు రైతులు పాల్గొన్నారు.

# స్పందించకపోతే పోరాటాలు తప్పవు

కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న ఉద్యోగులు, ఉపాధ్యాయులు

ప్రజాశక్తి-రాయచోటి

ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలపై ప్రభుత్వం స్పందించకపోతే పోరాటాలు తప్పవని ఫ్యాప్టో జిల్లా నాయకులు పేర్కొన్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోరుతూ ఫ్యాప్టో రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు దశల వారీ పోరాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కలెక్టరేట్‌లో డిఆర్‌ఒ సత్యనారాయణకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. ఉపాధ్యాయుల, విద్యారంగ సమస్యలు దీర్ఘకాలంగా అపరిష్కృతంగానే ఉన్నాయని పేర్కొన్నారు. పాఠశాల విద్యా వ్యవస్థను చిన్నభిన్నం చేస్తున్న జిఒఎంఎస్ నెంబర్ 117ను రద్దు చేయాలని ఉపాధ్యాయ సంఘాలు ఉద్యమిస్తున్నా ప్రభుత్వం పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. గత ఎన్నికలకు ముందు సిపిఎస్ విధానాన్ని రద్దు చేస్తానని ఉద్యోగ, ఉపాధ్యాయులకు మాట ఇచ్చి, హామీని నెరవేర్చకపోగా సిపిఎస్ స్థానంలో జిపిఎస్ విధానాన్ని ప్రవేశపెట్టడం దుర్మార్గమన్నారు. ఉపాధ్యాయులు నిరంతరం చేపడుతున్న బోధనేతర కార్యక్రమాల వల్ల విద్యా బోధన కుంటుపడుతుందని, దీనివల్ల ప్రభుత్వ పాఠశాలలలో విద్యనభ్యసిస్తున్న పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందడం లేదని తెలిపారు. పాఠశాల విద్యా శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ ఉపాధ్యాయుల పట్ల అనుసరిస్తున్న తీరు బాధాకరమని, ఉపాధ్యాయుల పట్ల ఆయన వైఖరిని ప్రభుత్వం నియంత్రించాలన్నారు. 11వ పిఆర్‌సి తోపాటు అన్ని రకాల బకాయిలను తక్షణమే విడుదల చేయాలని చేయాలన్నారు. చట్ట బద్ధమైన 12వ పిఆర్‌సి కమిటీని వెంటనే నియ మించాలని, కాంట్రాక్ట్ ఉద్యోగులను వెంటనే రెగ్యులర్ చేయాలని, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలు 11వ పిఆర్‌సికి అనుగుణంగా పెంచాలని వారు డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల సమస్యల పట్ల ప్రభుత్వం స్పందించకపోతే సమస్యల పరిష్కారానికి ఉద్యమాలే శరణ్యమని వారు పేర్కొన్నారు. డిమాండ్ల సాధనకు ఉపాధ్యాయులు అందరూ ఐక్యమై పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఫ్యాప్టో జిల్లా అధ్యక్షులు జగన్మోహన్‌రెడ్డి, జిల్లా కో-చైర్మన్ ఇలియాస్, హరిబాబు, శిబా తుర్రహ్మాన్ ఎగ్జిక్యూటివ్ సభ్యులు జాబిర్, రవీంద్రారెడ్డి, కిఫాయతుల్లా, అమీనుల్లా, సుబ్బారెడ్డి, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

# మద్దతు ధరకే పసుపు కొనుగోలు

### - జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి

కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అమర్‌నాథ్‌రెడ్డి

ప్రజాశక్తి-రాజంపేట రూరల్

ప్రభుత్వ మద్దతు ధర కంటే తక్కువ ధరకు రైతులు పసుపును అమ్ముకోరాదని ఉమ్మడి జిల్లా జడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం రాజంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రాంగణంలో ఎపి మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పసుపు పంట కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆకేపాటి మాట్లాడుతూ రైతులను అన్ని విధాల ఆదుకొనడానికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. ప్రస్తుత పసుపు పంటకు ప్రభుత్వం రూ.6850గా మద్దతు ధరను నిర్ణయించిందని పేర్కొన్నారు. పసుపు పంటను అమ్మాలనుకున్న రైతులు తప్పనిసరిగా నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు. పసుపు అమ్మాలనుకున్న రైతులు సిఎం యాప్‌లో ఇ-క్రాప్ ద్వారా పేర్లను రిజిస్టర్ చేసుకోవాలని తెలిపారు. పంటను నాణ్యత పరిశీలించి కొనుగోలు చేస్తామని మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ త్యాగరాజు తెలిపారు. పసుపు పంటకు ప్రభుత్వం మద్దతు ధరను ప్రకటించడంతోపాటు కొనుగోలు కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేయడం పట్ల రైతులు తమ హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి, రాజంపేట వ్యవసాయ శాఖ ఎడి, మార్కెట్ కమిటీ సెక్రటరీ, రైతులు పాల్గొన్నారు.

# ప్రజా సంక్షేమాన్ని విస్మరించిన ప్రభుత్వం

### - మాజీ ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే షాజహాన్ బాషా

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

రాష్ట్రంలో ప్రజా సంక్షేమాన్ని విస్మరించి పాలన సాగిస్తున్న ఏకైక పార్టీ వైసిపి అని మాజీ ఎమ్మెల్యే షాజహాన్ బాషా ఆరోపించారు. శుక్రవారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పట్టణంలో ట్రాఫిక్ సమస్యలతోపాటు ఇరుకైన రోడ్లు వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. తాను ఎమ్మెల్యేగా పనిచేసినప్పుడు మదనపల్లె నియోజకవర్గంలోని ప్రతి పంచాయతీలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత పట్టణంలోనే కాకుండా గ్రామీణ ప్రాంతాల్లో కూడా అనేక సమస్యలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చిన నాలుగేళ్లలో విద్యుత్ ఛార్జీలు విపరీతంగా పెంచి సామాన్యుల నడ్డి విరిచిన వైసిపి ప్రభుత్వాన్ని సాగనంపడానికి ప్రజలు సిద్ధంగా వున్నారని పేర్కొన్నారు. వైసిపి ఎమ్మెల్యే అధికారంలోకి వచ్చాక మదనపల్లె పట్టణాన్ని నాశనం చేశారని ధ్వజమెత్తారు. సామాన్య ప్రజలు పూర్తిగా విసిగిపోయారన్నారు. వచ్చే శాసనసభ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ ప్రభంజనం సృష్టించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు నాదెళ్ల శివ, నాగూర్ వల్లి, షంషీర్, సంగం హరి, జయన్న, బోరెవెల్ నాగరాజ, గిరీష్, మల్లి పాల్గొన్నారు.

## పార్టీ బలోపేతానికి కృషి చేయండి

ప్రజాశక్తి-రాయచోటి

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నియోజకవర్గ ఇన్‌చార్జి ఎస్.అల్లాబకాష్ పేర్కొన్నారు. పిసిసి అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు ఆదేశాల మేరకు రాయచోటి నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం సమన్వయ కమిటీ సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధిష్టానం జిల్లాలోని అన్ని నియోజకవర్గాలతో పాటు రాయచోటి నియోజకవర్గం కూడా నాయకులను కార్యకర్తలను ఎంపిక చేయడం జరిగిందని పేర్కొన్నారు. అనంతరం వారు అందరూ కలిసి మిఠాయిలు పంచిపెట్టారని తెలిపారు. నినాదాలు చేస్తూ రాబోయే కాలంలో రాహుల్ గాంధీని ప్రధానిగా చేసే లక్ష్యంగా పనిచేయాలని వారికి పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీలో తమకు అధిష్టానం నుంచి కమిటీలో స్థానాలు కల్పించినందుకు రాహుల్ గాంధీతో పాటు రాష్ట్ర పిసిసి అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జంగా గౌతంకు రాష్ట్ర మీడియా అధ్యక్షుడు తులసి రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో ఎస్‌ఎండి గౌస్ ,అజమతుల్లా, చెన్నకృష్ణ, ఖాదర్ బషా, రవణమ్మ, మహ్మద్ రఫీ ,మహబూబాషా, ధర్మారెడ్డి, మంజునాథ, ఖాదరవల్లి, మనోహర, రాందాస్, వెంకటరమణ పాల్గొన్నారు

క్షయవ్యాధి గ్రస్తులకు పౌష్టికాహారం అందిస్తున్న డాక్టర్ స్వాతి

## పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

ప్రజాశక్తి-వాల్మీకిపురం

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తోందని మదనపల్లి ధాత్రి ఫౌండేషన్ ఫౌండర్ డాక్టర్ స్వాతి అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వాసుపత్రిలో క్షయ వ్యాధి గ్రస్తులు 30 మందికి ఆరు నెలలకు సరిపోయే పౌష్టికాహారం కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు క్షయ వ్యాధి నివారణకు అనేక కార్యక్రమాలు చేపడుతున్నాయని, దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలలో పలు స్వచ్ఛంద సంస్థలు కూడా వారి వంతు కృషి చేస్తుండడం అభినందనీయమన్నారు. టిబి వ్యాధి సోకితే భయపడాల్సిన అవసరం లేదని, మందులు వాడడం వలన త్వరగా నయం అవుతాయన్నారు. బిడి, సిగరెట్లు, మందు, పొగాకు తదితర దురలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. టిబి రోగులకు పౌష్టికాహారం అందించేందుకు షాంధాసిని ఫౌండేషన్ అందిస్తున్న సహకారం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీలక్ష్మి, టిబి యూనిట్ సిబ్బంది నాగిరెడ్డి, మురళి, క్రిష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

## పట్టణాభివృద్ధే ధ్యేయం : చైర్మన్ 'పోలా'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

పట్టణ అభివృద్ధే ధ్యేయమని మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులురెడ్డి అన్నారు. శుక్రవారం పురపాలక కార్యాలయంలోని సభా భవనంలో కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. పట్టణంలోని పలు అభివృద్ధి పనులుపై చర్చించి తీర్మానం చేశారు. ఫ్లై ఓవర్ బ్రిడ్జి కింద గల 48 బ్లాకులలో ఆక్రమణలు తొలగించి సుందరీకరణ చేయుడ, డ్వాక్రా మహిళలకు రైతు బజారు, పార్కు ఏర్పాటుకు తీర్మానం చేశారు. పాత బస్టాండు సమీపంలో

సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసులురెడ్డి

961/ఎ సర్వే నెంబరులో 19 సెంట్లు స్థలాన్ని 1954 అక్టోబర్ 10వ తేదీన అప్పటి గ్రామ పంచాయతీ అధికారులు పెట్రోలియం పంపు ఏర్పాటుకు లీజుకు ఇచ్చారని, 2015 నుండి నేటి వరకు భారత్ పెట్రోలియం యాజమాన్యం స్పందించకపోవడంతో వారితో 2023 మార్చి 9వ తేదీన మున్సిపల్ చైర్మన్, కమిషనర్‌లు సమావేశం కూడా ఏర్పాటు చేశారని, పెట్రోల్ పంపు యాజమాన్యం ఎస్.సత్యనారాయణ అండ్ సన్స్ ఒక మాసం గడువు కోరి నేటికీ స్పందించకపోవడంతో భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ వారిని ఖాళీ చేయించి స్వాధీనం చేసుకునేందుకు కౌన్సిల్ సమావేశంలో తీర్మానం చేశారు. ప్రజా ప్రయోజనాల రీత్యా పట్టణ పరిధిలోని ఐదు కిలోమీటర్ల పరిధిలో గల ప్రభుత్వ భూములను మున్సిపాలిటీ స్వాధీనపరచుకొనుటకు కలెక్టర్ అనుమతి కోరుతూ ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఎర్రబల్లి, తాళ్లపాక గ్రామాలలోని 1224/1, 1274/2 సర్వే నంబర్లలోని 14 ఎకరాల ప్రభుత్వ భూమిలో వైయస్సార్ ఇండోర్ స్టేడియంకు పది ఎకరాలు, 1224/1, 1274/2 సర్వే నంబర్లలోని 14 ఎకరాలలో వైయస్సార్ శిల్పారామం ఏర్పాటు చేయుటకు కలెక్టర్‌కు ప్రతిపాదనలు చేస్తూ తీర్మానం చేశారు. ఈ సందర్భంగా పోలా శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ పట్టణాభివృద్ధి కోసం, పట్టణ ప్రజల సౌకర్యార్థంపై నిర్ణయాలు తీసుకోవడం జరిగిందని తెలియజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మర్రి రవి, కౌన్సిలర్లు, మున్సిపాలిటీ సిబ్బంది పాల్గొన్నారు.

# అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి : 'గడికోట'

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

మున్సిపల్ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులలో వేగం పెంచాలని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి సూచించారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపాలిటీ పరిధిలో జరుగుచున్న, జరగబోవు అభివృద్ధి పనులుపై మున్సిపల్, రెవెన్యూ, ఆర్‌అండ్‌బి, హౌసింగ్, ఎన్‌హెచ్, పబ్లిక్ అండ్ హెల్త్, విద్యుత్ శాఖల అధికారులుతో మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాష అధ్యక్షతన జరిగిన సమావేశంలో సుధీర్ఘంగా ఆయన శాఖల వారీగా సమీక్షించారు. అర్హులందరికీ పక్కా గృహాలు అందివ్వాలన్నదే ప్రభుత్వ ఆశయమని జగనన్న కాలనీలలో ఇళ్ల నిర్మాణాలలో వేగం పుంజుకోవాలని గృహ నిర్మాణ శాఖాధికారులకు ఆయన సూచించారు. అర్హత ఉండి పక్కా గృహాలు రానివారికి మంజూరు చేయిస్తామన్నారు. నారాయణరెడ్డిగారిపల్లె జగనన్న కాలనీ లోని ఇళ్ల నిర్మాణాల స్థితిగతులుపై ఆయన ఆరా తీశారు. అన్ని వీధులలోనూ విద్యుత్ సౌకర్యం కల్పించారా అని విద్యుత్ అధికారులును అడిగి తెలుసుకున్నారు. వరిగ, పెమ్మాడపల్లెల జగనన్న కాలనీలలో ఇళ్ల నిర్మాణాలును ప్రారంభించాలన్నారు. గృహ నిర్మాణాల బిల్లుల చెల్లింపులలో లబ్ధిదారులను ఇబ్బందులు పెట్టొద్దని, లంచాలు తీసుకోకూడదని హెచ్చరించారు. పట్టణంలోని గుణ్ణికుంట్ల రహదారి విస్తరణ పనులు పూర్తయ్యాయని, విద్యుత్ దీపాలఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఠాణా-సుండుపల్లె మార్గంలోని ఆంజనేయ స్వామి గుడి వరకు జరుగుతున్న నాలుగు వరుసలు రహదారి నిర్మాణపు పనులుపై ఆయన ఆర్‌అండ్‌బి అధికారులుతో ఆరా తీశారు.పనులను నాణ్యతగా, త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. రహదారుల విస్తరణకు రెవెన్యూ, ఇతర శాఖలు సహకరించాలని సూచించారు. క్రికెట్ స్టేడియం నిర్మాణాల పనుల స్థితిగతులపై చర్చించారు. ఆగస్టులోగా గ్యాలరీ నిర్మాణపు పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. సిబ్యాల వద్ద జరుగుచున్న బ్రిడ్జి పనులపై ఆరా తీశారు. దేవపట్ల-చిన్నమండెం రహదారి నిర్మాణంపై చర్చించారు. డైట్ హాస్టల్ ప్రాంగణంలో రూ 73 లక్షలుతో చేపట్టిన పార్క్ పనులుపై ఆయన అడిగి తెలుసుకున్నారు. జిమ్ పరికరాలు, ఓపెన్ జిమ్ పరికరాలును త్వరితగతిన ఏర్పాటు చేయాలని సూచించారు. పట్టణంలో పచ్చదనం పెంపొందించి సుందర పట్టణంగా తీర్చి దిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. మున్సిపల్ కార్యాలయం ఆవరణంలో సుమారు రూ.2 కోట్ల నిధులుతో చేపడుతున్న మున్సిపల్ కౌన్సిల్ హాల్ నిర్మాణాలపై చర్చించారు. ఎలక్ట్రికల్, ఫ్లోరింగ్, పిఒపి నిర్మాణపు పనులు, ఫర్నీచర్, సౌండ్ సిస్టమ్ ఏర్పాట్లుపై చర్చించారు. పట్టణంలోని మదనపల్లె రహదారి మార్గంలోని 25 సెంట్ల ప్రభుత్వ భూమిని మున్సిపల్ శాఖ పరిధిలోకి తీసుకుని శాశ్విత అభివృద్ధి పనులు ఏమి చేపట్టవచ్చో నిర్ణ యించాలని మున్సిపల్ కమిషనర్ గంగా ప్రసాద్‌కు సూచించారు. రింగ్ రోడ్డు చుట్టూ ప్రభుత్వ భూములు ఉంటే గుర్తించి బోర్డులు నాటాలని తహశీల్దార్ ప్రేమంత్ కుమార్‌కు సూచించారు. ప్రభుత్వ భూములను కాపాడకోకపోతే భవిష్యత్ వారికి ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. అన్ని రకాల భూముల సంబంధించిన పూర్తి వివరాలను పారదర్శకంగా ఉంచాలన్నారు. కడప- చిత్తూరు జాతీయ రహదారి లో రాత్రి వేళల్లో వీధి లైట్లు లేనందువల్ల తరచూ అధికంగా ప్రమాదాలు జరుగుచున్నాయని, త్వరితగతిన వీధి లైట్లును ఏర్పాటు చేయాలని ఎన్‌హెచ్ అధికారులుకు ఆయన ఆదేశించారు. పట్టణంలోని పెండింగ్ నాలుగు వరుసల రహదారి పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఫయాజుర్ రెహమాన్, కౌన్సిలర్లు ఆసిఫ్ అలీఖాన్, గౌస్ ఖాన్, సుగవాసి ఈశ్వర్ ప్రసాద్,రౌనక్, ఫయాజ్ అహమ్మద్, షబ్బీర్, జానం రవీంద్రా యాదవ్, సుగవాసి శ్యామ్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

## రైతులకు సబ్సిడీ వేరుశనగ విత్తనాలు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

రైతులకు సబ్సిడీతో వేరుశనగ విత్తనపు కాయలు పంపిణీ చేస్తున్నామని మదనపల్లె డివిజన్ వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు శివశంకర్ తెలిపారు. శుక్రవారం మండలంలోని బసినికొండ గ్రామ పంచాయతీ రైతు భరోసా కేంద్రం వద్ద రైతులకు విత్తనపు కాయలను ఆర్‌బికె చైర్మన్ కత్తి రాజు, సర్పంచ్ లక్ష్మీదేవి పంపిణీ చేశారు. కొండామర్రిపల్లి గ్రామంలో వేరుశనగ కాయలను మదనపల్లె మార్కెట్ యార్డ్ డైరెక్టర్ తట్టి శ్రీనివాసులురెడ్డి, నాయకులు ఇస్మాయిల్, దీపా వేమారెడ్డి, నాగరాజురెడ్డి, రమణ పర్యవేక్షణలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శివశంకర్ మాట్లాడుతూ రైతులు ఖరీఫ్‌లో వేరుశనగ పంట సాగుకు ప్రభుత్వం సబ్సిడీతో విత్తనపు కాయలను పంపిణీ చేస్తుందని తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆర్‌బికె సిబ్బంది గాయత్రి, సునీల్, రైతులు పాల్గొన్నారు.

## ఘనంగా ఎపిఎండిసి డైరెక్టర్ హరీష్‌రెడ్డి జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-వాల్మీకిపురం

రాష్ట్ర ఎపిఎండిసి డైరెక్టర్ హరీష్‌రెడ్డి జన్మదిన వేడుకలను శుక్రవారం మండలంలోని వాల్మీకిపురం, చింతపర్తి, గండబోయనపల్లి గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రభుత్వాసుపత్రి వద్ద వైసిపి మండల పార్టీ అధ్యక్షులు నీళ్లభాస్కర్, ఉపసర్పంచ్ కేశవ రెడ్డి ఆధ్వర్యంలో కేక్‌కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. అనంతరం వాల్మీకిపురం, చింతపర్తిలో ప్రజలకు అన్నదాన కార్యక్రమం నిర్వహిం చారు. కార్యక్రమంలో జడ్పిటిసి నిర్మల, నాయకులు రాయుడు, ఆనంద, రవి, చంద్ర, శ్యామ్, మహేష్, రాజేష్, సుధాకర్, వెంకటస్వామి పాల్గొన్నారు.

కేక్‌కట్ చేస్తున్న వైసిపి నాయకులు

ఆలయాలకు రూ.4 లక్షల విరాళం అందిస్తున్న ముక్కా రూపానందరెడ్డి

## ఆలయానికి రూ.4 లక్షల విరాళం

**ప్రజాశక్తి- రైల్వేకోడూరు**

ముక్కా రూపానంద రెడ్డి ఫౌండేషన్ ద్వారా రాజంపేట పార్లమెంటు నియోజకవర్గంలోని పలు ఆలయాలకు ఫౌండేషన్ అధినేత ముక్కా రూపానందరెడ్డి ముక్కావారిపల్లెలోని క్యాంపు కార్యాలయంలో రూ.4లక్షలు విరాళం చెక్కుల ద్వారా అందించారు. రైల్వే కోడూరు, రాజంపేట, పుల్లంపేట మండలాల్లోని రామాలయాలకు, రైల్వేకోడూరు మండలంలోని సాయిబాబా ఆలయానికి ముక్కా రూపానందరెడ్డి ఫౌండేషన్ ద్వారా నగదును అందించారు. గతంలోనూ ఫౌండేషన్ ద్వారా కోడూరు నియోజకవర్గంలోని పలు ఆలయాలకు ఆయన విరాళాలు ఇచ్చారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు ముక్కా మధు సూధన్‌రెడ్డి, పాపూరు రామిరెడ్డి, బత్తిన వేణుగోపాల్‌రెడ్డి, ముక్కావారిపల్లి సర్పంచ్ అరవ శ్రీధర్, గ్రామప్రజలు పాల్గొన్నారు.

## చలో విజయవాడను జయప్రదం చేయండి

**ప్రజాశక్తి-బి.కొత్తకోట**

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జూన్ 20న ఎపి భవన నిర్మాణ కార్మిక సంఘం ఎఐటియుసి ఆధ్వర్యంలో తలపెట్టిన చలో విజయవాడను జయప్రదం చేయాలని నియోజకవర్గ కార్యదర్శి వేణుగోపాల్‌రెడ్డి కోరారు. శుక్రవారం పట్టణంలో భవణ నిర్మాణ కార్మిక సంఘం, కార్పెంటర్ యూనియన్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వేణు గోపాల్‌రెడ్డి, కే.బాలకృష్ణలు మాట్లాడుతూ రాష్ట్రంలో భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని, పెండింగులో ఉన్న క్లైములకు వెంటనే నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఈనెల 20న నాడు ఛలో విజయ వాడను జయప్రదం చేసి కార్మికులకు న్యాయం జరిగేంత వరకు పోరాడుతామన్నారు. కార్యక్రమంలో బి.కుమార్, కె.నాగరాజు, జె.కదిరప్ప, కె.మస్తాన్, సి.కుమార్‌రెడ్డి ఎం.వెంకటకృష్ణ పాల్గొన్నారు.

## నిర్ణీత తేదీల్లోగా కౌన్సెలింగ్‌కు హాజరవ్వాలి

**ప్రజాశక్తి-కంభంవారిపల్లి**

నిర్ణీత తేదీల్లోగా ఇంటర్, డిగ్రీ కళాశాలల్లో కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని గ్యారంపల్లి గురుకుల జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చెన్నకేశవులు ఒక ప్రకటనలో కోరారు. ఫలితాలను aprs apcfss.in వెబ్‌సైట్‌లో హాల్ టికెట్ లేదా ఐడి నంబరుతో చూసుకోవచ్చన్నారు. గురుకుల పాఠశాలల్లో 5,6,7,8 తరగతులకు ఎంపిక చేయబడ్డ విద్యార్థులు ఆయా పాఠశాలలకు నేరుగా12 నుంచి అడ్మిషన్ పొందవచ్చని తెలిపారు. గురుకుల జూనియర్ కళాశాలల కౌన్సెలింగ్ కు ఎంపిక చేయబడిన రాయలసీమ విద్యార్థులందరికి కర్నూలు లోని హైదరాబాద్ హైవేలో గల న్యూ ఈద్గా వెనుక ఉన్న మైనార్టీ ఉర్దూ గురుకుల పాఠశాల ఆవరణంలో కౌన్సిలింగ్ జరుగుతుందని తెలిపారు. 12 నుంచి ఎంపిసి గ్రూపునకు 13న, బైపిసి గ్రూపునకు 14న, ఎంఇసి గ్రూపులకు 1:3 నిష్పత్తిలో కౌన్సిలింగ్ నిర్వహించడబుతుందని తెలిపారు. ఈనెల 15న డిగ్రీ కళాశాలకు ఎంపిక చేయబడిన విద్యార్థులు గుంటూరులో పాత బస్టాండ్ సమీపంలో గల పరీక్ష భవన్‌లో 15 న కౌన్సిలింగ్ కౌన్సిలింగ్. కౌన్సిలింగ్ కు అర్హత సాధించిన విద్యార్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్స్ తీసుకొని వారికి కేటాయించబడిన తేదీలలో ఆయా కౌన్సిలింగ్ కేంద్రాలకు హాజరు కావాలని కోరారు.

అన్నదానం చేస్తున్న శ్రీనివాసరాజు కుటుంబ సభ్యులు

## అన్నదానం గొప్పది

**ప్రజాశక్తి-రాజంపేట అర్బన్**

పట్టణ పరిధిలోని మన్నూరులోని ఎల్లమ్మ దేవస్థానంలో ఇటీవల రాజకీయ అరంగేట్రం చేసిన ఎల్లటూరు శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో ప్రజలకు విశేష అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కుటుంబ సమేతంగా పాల్గొని ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నదానం గొప్పదని అన్నారు. కార్యక్రమంలో సింగంశెట్టి నరేంద్ర, ఆలయ కమిటీ సభ్యులు పోతుల సుధాకర్, పత్తి వెంకటసుబ్బయ్య, పత్తినారాయణ, కడవకూటి సుధాకర్, ఇడిమడకలరామ, సింగంశెట్టి సూర్యనారాయణ, చిట్టి భాస్కర్, మన్నేరు వెంకటసుబ్బయ్య, పి.వి.ఆర్ కుమార్, నాని, దర్బార్, మౌలా, నాజర్ ఖాన్, సింగంశెట్టిసూరి, సమ్మెట శివ, బాబు, చింతలశివ పాల్గొన్నారు.

## పేద ముస్లిం బాలురకు ఉచిత వడుగులు

**ప్రజాశక్తి-రాజంపేట అర్బన్**

పట్టణంలోని ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం పేద ముస్లిం బాలురకు ఉచిత వడుగులు కార్యక్రమం ఉస్మాన్‌నగర్‌లో నిర్వహించారు. ప్రముఖ డాక్టర్ ఇక్బాల్ ముగ్గురు పేద ముస్లిం బాలురకు ఒడుగులు చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అసోసియేషన్ అధ్యక్షులు ఎస్.జి ఇనాయత్ బాలుర కుటుంబ యజమానికి మందులతో పాటు ఒక ఎర్ర దుప్పటి, ఐదు కేజీలు గోధుమపిండి, ఒక కేజీ చక్కెర, ఒక కేజీ ఉద్ది బేడలు, అర కేజీ నెయ్యి, ఒక లీటరు పామాయిల్ ఉచితంగా అందించారు. అనాథ బాలుడు అయిన షేక్ అతికి సాంప్రదాయబద్ధంగా ఎర్రటి దుస్తులను జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల చైర్మన్ ఎస్ఎండి కరీం ఉచితంగా అందించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు ముజఫర్ అహ్మద్, మోసిన్ ఖాన్, మిల్లర్ కరీం, జానీ బాషాపురం జానీ పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి ఎంపిపి పరామర్శ

**ప్రజాశక్తి-కలకడ**

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన శ్రీనివాసులు కుటుంబాన్ని ఎంపిపి శ్రీదేవిరవికుమార్ శుక్రవారం పరామర్శించారు.మండలంలోని బాటవారిపల్లి పంచాయతీ స్థానిక చిత్తూరు-కర్నూలు జాతీయ రహదారిపై గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో బాటవారి పల్లి పంచాయతీ చలమయ్య గారి పల్లికు చెందిన శ్రీనివాసులు భార్య కళావతి మృతి చెందిన విషయం పాఠకులకు తెలిసిందే. ప్రమాదంలో మృతి చెందిన కుటుంబాన్ని పరామర్శించి తన ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పెద్దమండ్యం తహశీల్దార్‌గా రాము

**పెద్దమండ్యం :** పెద్దమండ్యం తహసీల్దార్‌గా రాము శుక్రవారం పదవీబాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేచిన తహశీల్దార్ నిర్మాలదేవిని కలెక్టర్ కార్యాలయంకు కలకడ తహసీల్దార్‌గా పనిచేచిన రామును పెద్దమండ్యం బదిలీ వచ్చారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రాము మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజా సమస్యలపై దృష్టి సాధిస్తానని అన్నారు.

## పోలీసులకు సత్కారం

**నందలూరు :** నందలూరు పోలీస్ స్టేషన్ నుంచి రాజంపేటకు బదిలీ అయిన సిబ్బంది విజయ్, ప్రసాద్, నరసయ్యను ఎస్ఐ చెన్నకేశవ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఉద్యోగులకు బదిలీ అనేది తప్పనిసరని అన్నారు. ఎక్కడ పని చేసిన ప్రజలకు తమ వంతు సేవలందించాలని తెలిపారు. కార్యక్రమంలో ఎఎస్ఐ రాముడు, హెడ్ కానిస్టేబుల్ సుబ్బరాయుడు, పోలీసులు రామకృష్ణ,శీను, దర్బార్, రవి, ప్రసన్నలక్ష్మి, చంద్రయ్య ,దిలీప్ కుమార్ హోంగార్డు శ్రీనివాసరాజు, మేరీ పాల్గొన్నారు.

# పేదల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే

**ప్రజాశక్తి-నిమ్మనపల్లి**

పేదల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే నవాజ్‌బాషా పేర్కొన్నారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి ప్రతి అడుగు పేదల కోసమేనని, వారి జీవితాల్లో వెలుగులు నింపేందుకు అహర్నిశలు కృషి చేస్తున్నారని కొనియాడారు. మండలంలోని ముష్టూరు పంచాయతీలోని పారేసువారిపల్లి, చల్లావారిపల్లి, మర్రిబండ, ముష్టూరు, వలసపల్లిలో సర్పంచు చెంద్రాయుడు ఆధ్వర్యంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ అధికారులు, సచివాలయ ఉద్యోగులు, ప్రజా ప్రతినిధులు, వాలంటీర్లతో కలసి ఇంటింటికి వెళ్లారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పారేశువారిపల్లెలో అంగన్వాడీ కేంద్రం మంజూరు చేయాలని ప్రజలు కోరారు. తాగునీటి సౌకర్యం, మురుగునీటి కాలువలు, నీటి కుళాయిలు, సిమెంటు రోడ్లు వంటివీ కావాలని ప్రజలు కోరగా వెంటనే ఏర్పాటు చేయటానికి సంబంధించిన అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపిపి నరసింహులు, సింగిల్ విండో అధ్య క్షులు రెడ్డిశేఖర్ రెడ్డి, ఆర్‌బికె చైర్మన్ ప్రవీణ్ కుమార్‌రెడ్డి, వైస్ సర్పంచ్ మహమ్మద్ రఫీ, ఎంపిటిసి వెంకటరమణ, నాయకులు రాజగోపాల్, వెంకటరమణ, కొండగాళ్ల రమణ, ఖాదర్ బాషా, నారాయణ, తహశీల్దార్ సిఆర్.మంజుల, ఎంపిడిఒ లీలామాధవి, ఎస్ఐ రామకృష్ణ పాల్గొన్నారు. **గాలివీడు :** జగనన్న పాలనలో సంక్షేమ విప్లవం కొనసాగుతోందని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని సిసిపల్లెలో రెండవ రోజు జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు. కడప వాండ్లపల్లె , ఎర్రదొడ్డిపల్లె, హరిజన వాడ,వడ్డెపల్లె, నల్లగుండ్ల పల్లె, గుర్రం

గృహ లబ్దిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా

వాండ్లపల్లె లలో గడప గడపకు శ్రీకాంత్ రెడ్డి వెళ్లి సమస్యలపై ఆరా తీశారు.ప్రభుత్వం నుండి అందుతున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ఆయన అడిగి తెలుసుకున్నారు.ఈసందర్భంగా శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ జగన్ ప్రభుత్వంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. మరింత మెరుగైన పాలన సాగించేందుకు, ప్రజా సనస్యలును తెలుసుకుని వాటి సత్వర పరిష్కారానికి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీచైర్మన్ కర్ణపు విశ్వనాథరెడ్డి, వైస్ఎంపిపి మిట్టపల్లి యధుభూషణ రెడ్డి, ఎంపిటిసిలు, ప్రభా వతమ్మ, చిన్నరెడ్డి, సర్పంచ్‌లు కామసాని చెన్నకేశవరెడ్డి, ఉమాపతి రెడ్డి, కాల్వపల్లె కమలమ్మ, ఉమాప్రభాకర్,జానకమ్మ, రఘురాం,గౌను వెంకట రమణ, కానాల రమణారెడ్డి పాల్గొన్నారు.

ప్రదర్శనలో మొదటి స్థానంలో నిలిచిన లేగదూడ

## లేగదూడల పెంపకంపై అవగాహన

**ప్రజాశక్తి-నిమ్మనపల్లి**

మండల పరిధిలోని అగ్రహారం గ్రామంలో శుక్రవారం మేలు రకం, సంకరజాతి ఆవుల లేగ దూడల పెంపకంపై పాడి రైతులకు అవగాహన కార్యక్రమాన్ని జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ సంచాలకులు డాక్టర్ గుణశేఖర్ పిల్లై, తిరుపతి జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఉప సంచాలకులు డాక్టర్ బాలసుబ్రమణ్యం, మదనపల్లి డివిజన్ పశుసంవర్ధక శాఖాధికారి డాక్టర్ కోటేశ్వరరావు, ఎడిఎ శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో పశుసంవర్ధక శాఖాధికారి డాక్టర్ సాదు సురేష్ నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్థానిక సర్పంచు వడ్లమూడి ఉషారాణి హాజ రయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పడమటి మండలాల లోని రైతులు ఎక్కువగా వ్యవసాయంతో పాటు, పాడి పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్నారని అన్నారు. గ్రామాలలోని పాడి రైతు లను అభివృద్ధి దిశగా పయనింప చేయడానికి పశుగణాభివృద్ధి సంస్థ, పశుసంవర్ధక శాఖ ఉమ్మడిగా కృషి చేస్తోందన్నారు. అగ్రహారంలో సుమారు 100 ప్యాయ లేగ దూడలను ప్రదర్శించి వాటిలో ఉత్తమ జాతి లక్షణాలు, ఆరోగ్యం, ఎత్తు, బరువు వంటి ప్రాథమిక లక్షణాలను కలిగిన వాటిని గుర్తించి మొదటి మూడు స్థానాల్లో నిలిచిన దూడలకు ఉత్తమ బహుమతులను ప్రధానం చేశామన్నారు. కార్యక్రమంలో మదనపల్లి డివిజన్ పశుసంవర్ధక శాఖాధికారి కోటేశ్వరరావు, ఎడిఎ శ్రీధర్ రెడ్డి, పశు వైద్యాధికారి సాదు సురేష్, పశు వైద్య సహాయకులు, పాడి రైతులు పాల్గొన్నారు.

## విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

**ప్రజాశక్తి-కలికిరి**

విద్యార్థులు తమ విజ్ఞానాన్ని పెంపొందించుకోవడానికి గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని స్థానిక గ్రంథాలయ అధికారి విజయకుమార్ తెలిపారు. స్థానిక శాఖ గ్రంథాలయంలో గతనెల 8 నుంచి నిర్వహిస్తున్న వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా శుక్రవారం విద్యార్థులకు క్విజ్, వక్తృత్వ పోటీలను నిర్వహించారు. గెలుపొందిన విద్యా ర్థులకు ఈ నెల 11న బహుమతులు, ప్రశంసా పాత్రలను అందిస్తామని తెలిపారు. ఈ వేసవి శిబిరాలను విద్యార్థులు చక్కగా సద్వినియోగం చేసు కున్నారని, యోగ, స్పోకెన్ ఇంగ్లీష్, డాన్స్, సంగీతం, యాక్టింగ్ తదితర అంశాలపై శిక్షణ ఇవ్వడం జరిగిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో విద్యా ర్థులు గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు.

## బాలకార్మికులు లేని సమాజం కోసం కృషి

**ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్**

బాల కార్మికులు లేని సమాజమే సమాజ అభివృద్ధికి సోపానమని చైతన్య సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు ఎం.పి.ఆనందన్ తెలిపారు. ప్రపంచ బాలకార్మిక వ్యతిరేక వారోత్సవాల సందర్భంగా చైతన్య స్వచ్ఛంద సేవా సంస్థ ప్రాంగణంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఐక్య రాజ్యసమితి 2000 సంవత్సరం నుంచి ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం ఐఎల్ఓ ఇంటర్నేషనల్ లేబర్ ఆర్గనైజేషన్ ద్వారా ప్రతి సంవత్సరం జూన్ 12న జరుపు కుంటున్నామన్నారు. ఈ నెల 12న బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన దినో త్సవంపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహిస్తామని తెలిపారు.

## కో-ఆర్డినేషన్ కమిటీ సభ్యుడిగా అమృత్ తేజ

**ప్రజాశక్తి-పీలేరు**

కాంగ్రెస్ పార్టీ పీలేరు అసెంబ్లీ నియోజకవర్గ కో-ఆర్డినేషన్ కమిటీ సభ్యుడిగా అమృత్ తేజను నియమిస్తూ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు గిడుగు రుద్రరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ జంగా గౌతమ్ ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం పీలేరులో అమృత్‌తేజ మాట్లాడుతూ రాయలసీమ జిల్లాలోని అసెంబ్లీలకు కోఆర్డినేషన్ కమిటీలు వేయడంతో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం అవుతుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఎన్.ఎస్.యు.ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, పిసిసి కోఆప్షన్ సభ్యుడిగా ఉన్న తనను అసెంబ్లీ కో-ఆర్డినేషన్ కమిటీ సభ్యుడిగా నియమించడంతో తన బాధ్యత మరింత పెరిగిందని అన్నారు.

## ప్రారంభమైన శ్రీమారెమ్మతల్లి ఉత్సవాలు

**ప్రజాశక్తి-నందలూరు**

మండలంలోని నాగిరెడ్డి పల్లె గ్రామం లో వెలసిన శ్రీ మారెమ్మ తల్లి ఆలయంలో శుక్రవారం ఉదయం అమ్మవారి పొంగళ్లు మహోత్సవాలు అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. గ్రామ పురోహితులు బండాత్మకూరు శివకుమార్ శర్మ ఉదయం మహా గణపతి పూజ తో విశేష పూజలు మొదలయ్యాయి. అనంతరం ధ్వజారోహణ, మహాగణపతి హోమం, మారెమ్మ తల్లి మూల మంత్ర హోమాలు పెద్ద ఎత్తున మహిళలు, గ్రామస్తుల నడుమ ప్రారంభమయ్యాయి. శ్రీసత్యమ్మ, శ్రీమారమ్మ తల్లికి 101 టెంకాయలతో పూజా కార్య క్రమా లు నిర్వహించారు. సాయంత్రం సామూహిక కుంకుమార్చనలు, మూల మంత్ర హోమములు, భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శనివారం కూడా ప్రత్యేక కార్యక్రమాలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. ఈ ఉత్సవాలలో నాగిరెడ్డిపల్లె గ్రామ నాయకులు, ప్రజలు, భక్తులు, ఇతర గ్రామాల వారు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ అంతరాయం

**ప్రజాశక్తి-రాజంపేట అర్బన్**

పట్టణంలో శనివారం విద్యుత్‌కు అంతరాయం కలుగు తుందని డిఇ సురేంద్రనాథ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 33/11కేవీ లైన్లకు సమీపం లో ఉన్నటువంటి చెట్లు తొలగించే కార్యక్రమం, మరమ్మతుల కారణంగా 33/11 కేవీ బ్రాహ్మణపల్లి, తాళ్ళపాక, వత్తలూరు, కొండూరు, పెనగలూరు, బెస్తపల్లి, టిజి.పల్లి, మందరం సబ్ స్టేషన్ మరియు వీటి పరిధిలో ఉన్న పరిసర గ్రామీణ ప్రాంతాలలో 'విద్యుత్ సరఫరా' ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిలిపి వేయబడునని డిఇ పేర్కొన్నారు. వినియోగ దారులు విద్యుత్ సంస్థకు సహకరించ వలసినదిగా ఈ సందర్భంగా ఆయన కోరారు.

## కాన్పులకు ముహూర్తాలు వద్దు

**ప్రజాశక్తి-పీలేరు**

కాన్పులకు ముహూర్తాలు వద్దని, సాధారణ సుఖప్రసవం తల్లీ, బిడ్డకు ఆరోగ్యదాయకమని డాక్టర్ మేష్ రెడ్డి గర్భవతులకు హితవు పలికారు. శుక్రవారం తలుపుల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రధాన వైద్యాధికారి ఆధ్వర్యంలో నెలవారి పిఎంఎస్ఎం అభియాన్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భవతులకు వ్యాధుల నిర్ధారణ, ఆరోగ్య పరీక్షలతో పాటు ఆరోగ్య మెళకువలు తెలిపారు. తమకు పుట్టబోయే బిడ్డ మంచి జాతకం, ప్రసిద్ధి గాంచిన రోజుల్లోనే జన్మించాలని కోరుకుంటూ సిజేరియన్ కాన్పులు చేసుకోవడం వల్ల ప్రస్తుతం ఆపరేషన్ల సంఖ్య బాగా పెరిగి, సాధారణ కాన్పులు భారీగా తగ్గుతున్నాయన్నారు. దీంతో తల్లీ, బిడ్డలకు కొద్దిపాటి ఆరోగ్య సమస్యలు లేకపోలేదని, నెలలు నిండిన సాధా రణ సుఖ ప్రసవం తల్లి బిడ్డకు ఎంతోమేలని, ఈ విషయాన్ని ప్రతి గర్భిణి గుర్తించాలని చెప్పారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ కొండయ్య, పర్య వేక్షకులు కృష్ణయ్య, కుసుమ, ఏఎన్ఎం నాగవేణి, స్టాఫ్ నర్సులు, ల్యాబ్ టెక్నీ షియన్, ఆశ కార్యకర్తలు, గర్భిణీ స్త్రీలు పాల్గొన్నారు.

## మినీ మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

**ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్**

టిడిపి మినీ మేనిఫెస్టోను ప్రజల లోకి తీసుకెళ్లాలని మాజీ ఎమ్మెల్యే, నియో జకవర్గ ఇన్‌ఛార్జి దొమ్మలపాటి రమేష్ తెలిపారు. శుక్రవారం టిడిపి పార్టీ మదనపల్లి నియోజకవర్గ, పట్టణ, మండల స్థాయి నాయ కులతో కదిరి రోడ్డులోని టిడిపి కార్యాల యంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి నియోజకవర్గ పరిశీలకులు చలపతి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబునాయుడు ప్రవేశపెట్టిన మినీ మేనిఫెస్టోను ప్రజలలోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిపై విమర్శలు గుప్పించారు. కార్య క్రమంలో పట్టణ అధ్యక్షులు భవాని ప్రసాద్, ఉపాధ్యక్షులు ఎర్రబల్లి రమణారెడ్డి, వంటి కొండ వెంకటేష్, క్లస్టర్ ఇన్‌ఛార్జి అప్పిన నపల్లి భాస్కర చారి, పరాటకొండ మధుబాబు, తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షులు నాదెండ్ల అరుణ్‌తేజ్, జనరల్ సెక్రెటరీ ఎస్. భావజాన్, పెద్ద ఎత్తున కార్యకర్తలు పాల్గొన్నారు.

## 'స్పందన'కు అధికారులు హాజరవ్వాలి

**ప్రజాశక్తి-పెద్దమండ్యం**

ప్రతి సోమవారం జరుగుతున్న స్పందన కార్యక్రమానికి మండలంలోని అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరు కావాలని ఎంపిపి పూర్ణచంద్రికరమేష్ పిలుపునిచ్చారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపిపి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశంలో పశువైద్యులు డాక్టర్ విక్రమ్‌రెడ్డి మాట్లాడుతూ పాడి ఆవులకు బీమా రూ.400 చెల్లిస్తే రూ.30వేలు బీమా వర్తిసుందని అన్నారు. ఆమూల్ డైరీకి2200 లీటర్ల పాలు వస్తున్నట్లు తెలిపారు. అనతరం పిఆ రవీంద్రుడు మాట్లాడుతూ పెద్దమండ్యం, కలిచెర్ల ,పాపేపల్లి రెవెన్యూ గ్రామాల్లో వాటర్ షీడ్ తరపున రాయితీ పై రైతులకు వ్యవసాయమునకు సంబంధించిన పరికరాలు ఇస్తామని తెలిపారు. వాటర్ షీడ్ పనులు కు గిట్టుబాటు ధర కల్పించాలని పెద్దమండ్యం సర్పంచ్ బాషా, ఎంపిటిసి జయరాం సభ దృష్టికి తీసుకువచ్చారు. అంతలో పిఒ ఎఒఎ సురేష్‌బాబు మాట్లాడుతూ 6594 మంది రైతులు కు రైతుభరోసా క్రిందరూ.3.63కోట్లు కలిచెర్ల పెద్దమండ్యం పంచాయతీలో రూ.20లక్షలతో యాంత్రికరణ పంపిణీ చేసినట్లు తెలిపారు.

## వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలి

**ప్రజాశక్తి-గాలివీడు**

ప్రతి రైతు సాగు చేసే పంటలపై అధికారుల సూచనలు సలహాలు పొందితేనే అభివృద్ధి జరుగు తుందని లాభం పొందుతారని లేకపోతే రైతుల నష్టపోయే పరిస్థితి ఏర్పడతాయని జిల్లా వ్యవసాయ అధికారి చంద్రనాయక్ పేర్కొన్నారు శుక్రవారం మండల వ్యవసాయ కార్యాలయంలో మండల వ్యవసాయ అధికారి వంశీధర్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన రైతుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ భూమి దుక్కు నుంచి పంట ఓర్పు వరకు వ్యవసాయ అధికార సుజాత పాటిస్తేనే అభివృద్ధి జరుగుతుందని రైతులకు ప్రజలు ప్రయోజనం లభిస్తుందని అని పేర్కొన్నారు కార్యక్రమంలో ఎఇఒలు, రైతులు పాల్గొన్నారు.

## టిడిపిలో చేరిన యువత

**ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్**

యువతను పార్టీలోకి ఆహ్వానిస్తున్న షాజహాన్‌బాషా

పట్టణంలోని స్థానిక ప్రశాంత్‌నగర్‌కు చెందిన 50 మందికి పైగా యువత ప్రవీణ్ ఆధ్వర్యంలో శుక్రవారం మాజీ ఎమ్మెల్యే షాజ హాన్ బాషా సమక్షంలో టిడిపి లోకి చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఆశయాలు నచ్చి, యువతకు బంగారు భవిష్యత్తు ఉంటుందని నమ్మకంతో టిడిపిలో చేరామని అన్నారు. రాష్ట్ర భవిష్యత్తు యువతతోనే సాధ్యమని, సత్ప్రవర్తనతో యువత ముందుకెళ్లి రాష్ట్ర అభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలని తెలిపారు. కార్యక్రమంలో నాగూర్‌వల్లి, షంషీర్, వరుణ్ చౌదరి, రాజేష్, ఇంతియాజ్, రెడ్డి రాయల్, పెద్ద సంఖ్యలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యుదాఘాతంతో వాలంటీర్ మృతి

**ప్రజాశక్తి-బి.కొత్తకోట**

విద్యుదాఘాతానికి గురై గ్రామ వాలంటీర్ మృతి చెందిన సంఘటన పిటిఎం మండలంలో శుక్రవారం చోటుచేసుకుంది. మృతుడి సోదరుడు టి.విజయకుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు.. తన సోదరుడు టి.జయచంద్ర(26) టి.సదుం గ్రామానికి గ్రామవాలంటీరుగా వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడన్నారు. శుక్రవారం ఉదయం వ్యవసాయ కూలీ పనులకని అనంతపురం గ్రామానికి చెందిన కృష్ణమూర్తి వ్యవసాయ పొలంలో ఉన్న అల్లనేరేడు చెట్టులో ఉన్నటువంటి నేరేడు కాయలు కోయడానికి వెళ్లి, ఆ చెట్లల్లో నేరేడు కాయలు కోస్తుండగా ఆ చెట్టు మీద వెళ్ళిన కరెంటు తీగలు తగిలి విద్యుదాఘాతనికి గురై ఆ చెట్టుపై నుంచి క్రింద పడిపోయాడని తెలిపారు. అతనితో పాటు వెళ్లిన కె.శ్రీనాథ్, యం.నాగరాజులు తమ స్వంత వాహనంలో జయచంద్రను ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా అక్కడ డాక్టర్లు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారని చెప్పారు. మృతుడి సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ ఘటనపై పిటిఎం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కలకడ : గర్భిణిలకు వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ కిషోర్‌కుమార్‌రెడ్డి

## గర్భిణులకు రక్త పరీక్షలు

**ప్రజాశక్తి-నందలూరు**

ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 65 మంది గర్భిణులకు రక్త పరీక్షలు నిర్వహించినట్లు డాక్టర్ శ్రీనిజ తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ గర్భిణులు బిపి, రక్త పరీక్షలు నిర్వహించడంతో పాటు మందులను ఉచితంగా పంపిణీ చేశామన్నారు. ప్రతి నెల 9, 10 తేదీలలో జరిగే కార్యక్రమం గర్భిణీ లందరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ చంద్రశేఖర్ రెడ్డి, సూపర్వైజర్ హిమశంకరి, ఎంఎల్‌హె చ్‌పిలు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు. **కలకడ :** మండలంలోని ఎర్రకోటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికార్లు డాక్టర్ ఎం.వి కిషోర్ కుమార్‌రెడ్డి, డాక్టర్ జవహర్‌బాబు ల ఆధ్వర్యంలో ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభయాన్ కార్యక్రమం జరిగినది. గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించి, పది గ్రామలకన్నా తక్కువ హిమోగ్లోబిని ఉన్నవారికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఐరన్, సుక్రోజ్ ఇంజక్షన్ ఇవ్వటం వలన వారి హిమగ్లోబిన్ శాతం పెరుగుతుందని వైద్యాధికారి తెలిపారు. కార్యక్రమంలో ఎంపిహెచ్ ఇఒజి. జయరా మయ్య పిహెచ్ఎన్ సుబ్బరత్నమ్మ, సూపర్వైజర్స్ షేక్ ముజీ బ్‌బాషా, బి.రెడ్డమ్మ, స్టాఫ్‌నర్స్ భారతమ్మ, ల్యాబ్ టెక్నీషియన్ షేక్ జమీల్‌అహ్మద్, ఆరోగ్య కార్యకర్తలు వాణి, శ్రీలక్ష్మి, లక్ష్మీ, భాగ్యమ్మ ఎంఎల్ హెచ్‌పి రాజ పాల్గొన్నారు.

## ఎంపిడిఒగా సూర్య నారాయణరెడ్డి

**రామపురం :** రామాపురం ఎంపిడిఒగా సూర్యనారాయణరెడ్డి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ముద్దనూరు ఎండిఒ కార్యాలంలో ఎఒగా విధులు నిర్వహిస్తూ ఎంపిడిఒ ప్రమోషన్‌పై ఎంపిడిఒగా బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న హైదర్‌వలి చక్రాయిపేట ఎండిఒగా బదిలీపై వెళ్లారు.

## విద్యతోపాటు క్రీడల్లోనూ రాణించాలి

**ప్రజాశక్తి-కలకడ**

విజేతగా నిలిచిన జట్టుకు మొమెంటో అందిస్తున్న ఎంపిపి

విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో రాణించాలని ఎంపిపి శ్రీదేవిరవికుమార్ పేర్కొన్నారు. మండలంలోని బాటవారిపల్లి పంచాయతీ కె.మాది గపల్లి వద్ద గత ఏడు రోజులుగా జరుగుతున్న క్రికెట్ టోర్నమెంటు శుక్రవారంతో ముగిసింది. క్రికెట్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపిపి మాట్లాడుతూ క్రీడల వల్ల శరీర దారు ఢ్యానికి ఎంతో దోహదపడతాయని అన్నారు. కాబట్టి ప్రతి ఒక్కరూ క్రీడలను ప్రోత్స హించా లని తెలిపారు. ఈ టోర్న మెంట్ నందు 16 జట్టులు పాల్గోనగా మాదిగపల్లి టీమ్ గెలుపొందింది. రన్నర్స్‌గా తిమ్మాపురం వడ్డిపల్లి టీమ్, మ్యాన్ ఆఫ్ ది సిరీస్ రామంజులు కైవసం చేసుకున్నాడు. విజేతగా నిలిచిన జట్టుకు, రన్నర్స్‌కు బహుమతులు ప్రదానం చేసినట్లు చెప్పారు.

# క్రైం కార్నర్

## నాటుసారా నిందితుడు అరెస్టు

**ప్రజాశక్తి-నిమ్మనపల్లి**

నాటు సారాను విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి కోర్టులో హాజరపరిచినట్లు స్థానిక ఎస్ఐ పి.రామకృష్ణ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు..కొండయ్యగారిపల్లికు చెందిన చిన్నికృష్ణ నాటుసారాను అక్రమంగా విక్రయిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు పోలీసులు నిఘా ఉంచినట్లు తెలిపారు. గురువారం సాయంత్రం కొండయ్యగారిపల్లి సమీపంలో నాటు సారాను విక్రయిస్తుండగా పోలీసులు దాడులు నిర్వహించి అతనిని అదుపులోకి తీసుకొని అతని వద్ద నుండి అయిదు లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితుడి పై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్ఐ తెలిపారు. ఎవరైనా నాటు సారా తయారీ చేసిన, రవాణా చేసిన, విక్రయించిన కేసులు నమోదు చేసి, జైలుకు పంపడం జరుగుతుందని హెచ్చరించారు.

## నాలుగు ఇసుక ట్రాక్టర్లు సీజ్

**ప్రజాశక్తి-నిమ్మనపల్లి**

నిమ్మనపల్లి : పోలీసులు సీజ్ చేసిన ఇసుక ట్రాక్టర్

మండల పరిధిలో అక్రమంగా ఇసుకను రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు స్థానిక ఎస్ఐ పి.రామకృష్ణ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు.. చౌడేపల్లి మండలం చిన్నకొండామర్రికి చెందిన ఓ వ్యక్తికి సంబంధించిన ట్రాక్టర్ మండలంలోని ఆచార్లపల్లి వద్ద అనుమతులు లేకుండా గత కొంతకాలంగా అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్లు సమాచారం అందిం దన్నారు. పోలీసులు నిఘా ఉంచి గురువారం సాయంత్రం ఆచార్లపల్లి వద్ద నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని, సీజ్ చేసి, డ్రైవర్, ట్రాక్టర్ యజమానిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మండలంలో ఎక్కడ రిచ్‌లు లేవని, అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను రవాణా చేస్తే కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ హెచ్చరించారు. **బి.కొత్తకోట :** మండలంలోని ఆలేటి వాగులో గత కొన్ని రోజులుగా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు ఎస్ఇబి సిఐ శ్రీహరిరెడ్డి పేర్కొన్నారు.ఈ సందర్భంగా శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారని అందిన ముందస్తు సమాచారం మేరకు తమ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించామన్నారు.ఈ నేపథ్యంలో ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను సీజ్ చేసి,డ్రైవర్లను అదుపులోకి తీసుకు న్నామన్నారు. సిజ్ చేసిన ట్రాక్టర్లను బి.కొత్తకోట పోలీస్ స్టేషనుకు తరలించి కేసు నమోదు చేసినట్లు ఆయన వెల్లడించారు.అంతేకాకుండా ఎక్కడైనా ఇసుకను అక్రమంగా రవాణా చేస్తే ట్రాక్టర్లను సీజ్ చేసి,యజమానులు, డ్రైవర్లపై కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు.

## వృద్ధురాలిపై దాడి

**ప్రజాశక్తి-రాజంపేట అర్బన్**

ఆస్తి తగాదాల కారణంగా గుడిలో సేద తీరుతున్న వృద్ధురాలిపై ఆమె కుమారుడు మనవడు దాడి చేసిన ఘటన శుక్రవారం యర్రబల్లిలో చోటు చేసుకుంది. వృద్ధురాలి చిన్న కుమారుడు షేక్ కరీముల్లా తెలిపిన వివరాల మేరకు సమాచారం ఇలా ఉన్నాయి. షేక్ షరీఫాబీ, హుసేన్ సాహెబ్ దంపతులకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. వారికి రెండు గృహాలు ఉండగా కుమారులు ఇరువురికి చెరొక మిద్దె పంచేందుకు చూడగా పెద్ద కుమారుడు ఎస్.మస్తాన్ రెండు గృహాలు తనకే కావాలని గత కొంతకాలంగా తరచూ గొడవపడేవాడని., పోరు భరించలేక వృద్ధ దంపతులు ఇద్దరూ కుమారులకు దూరంగా మనుమడితో కలిసి ఎర్రబల్లిలో నివాసం ఉండేవారని తెలిపారు. శుక్రవారం పెద్ద కుమారుడు మస్తాన్, తన కుమారుడు షాహిద్ తో కలిసి ఎర్రబల్లిలోని చౌడేశ్వరి ఆలయంలో సేద తీరుతున్న తన తల్లి షరీఫాబీ సేద తీరుతుండగా బూజు కర్రతో దాడి చేసి నెట్టివేయడంతో తలకు గాయమైందని తెలిపారు. గాయపడిన షరీఫా బీ ను ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించి చికిత్సను అందిస్తున్నారు. ఇటీవలే ఆ వృద్ధురాలికి గుండె నొప్పి రావడంతో స్టెంట్లు వేశారని, ఏమాత్రం మానవత్వం లేకుండా సొంత కుమారుడు, మనవడే ఆస్తి కోసం వృద్ధురాలిని చంపేందుకు సిద్ధపడ్డారని కరిముల్లా ఆవేదన చెందారు. ఈ ఘటనపై రూరల్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.